# రాంషాగారింట్లో రాణి

కథ

మధురాంతకం నరేంద్ర

"మా రాణికి కొత్తవాళ్లంటే మహాచిరాకు. లేకుంటే నిన్ను మా యింటికే తీసుకెళ్లేవాణ్ణి!" అన్నాడు రాంషా పదమూడోసారి.

అప్పటికి మేం తొమ్మిది హోటళ్లకు వెళ్లి 'నోరూం' సమాధానంతో బిక్కమొహం పెట్టుకుని తిరిగొస్తున్నాం. దారిలో వో రెస్టారెంటుకు తీసుకెళ్లి, కాఫీటీలలో నాకేది యిష్టమో అడగాలన్న మర్యాదను సైతం మరిచిపోయి, తెప్పించిన కాఫీని సగం దాకా జుర్రిన తర్వాత, ముఖంలోని విసుగును అలాగే పదిలంగా రక్షించుకుంటూ "యీ వూరెప్పుడొచ్చావు?" అని ప్రశ్నించాడు.

గుటకగుటకకూ చేదు పెరుగుతున్నట్టున్న కాఫీని బలవంతంగా మింగుతూ "తెల్లవారి యెనిమిదికొచ్చింది రైలు. వైటింగ్‌రూంలో ముఖం కడుక్కుని, కాంటీనులో టిఫెను తిన్నాను. నేరుగా ఆఫీసుకెళ్లిపోయాను. భగవాన్ వూర్లో రైలు దిగుతూనే మీకు ఫోన్ చేయమన్నాడు. నాకు మధ్యాహ్నం లంచ్ బ్రేకు దాకా మీకు ఫోన్ చేసే తీరిక దొరకలేదు" అన్నాను.

"యీ సీజనల్లో యీ వూళ్లో యాత్రికుల రద్దీ యెక్కువనీ, హోటళ్లలో రూములు దొరకడం కష్టమనీ మీ భగవాన్‌కు ఫోన్లోనే చెప్పాను. నా మాట పట్టించుకోకుండా, ముందుగా చెప్పకుండా, యిలా హఠాత్తుగా నిన్ను రైలెక్కించేశాడు. యిప్పుడు యెక్కడ దింపాలి నిన్ను?" అంటూ తాను తాగుతున్న కాఫీలోని చేదునంతా తన చూపుల్లోకి బదలాయించసాగాడు రాంషా.

"చాలారోజులుగా మా హెడ్డాఫీసులో పని. సెలవులు దొరక్క యిన్నాళ్లుగా రాలేకపోయాను. యీ వూరు నాకు కొత్త. అన్నీ మీరే దగ్గరుండి చూసుకుంటారని భగవాన్ ధైర్యం చెప్పాడు' అన్నాను వీలయినంత బేలగా.

బేరర్ తీసుకొచ్చిన బిల్లుకు నేను డబ్బులు చెల్లిస్తుంటే నిర్లిప్తంగా చూస్తూ "భగవాన్ నాకంత దగ్గరి స్నేహితుడేమీగాదు. యెప్పుడో మూడు సంవత్సరాల క్రితం మేఘాలయలో ట్రైనింగ్‌లో కలిశాడు. అంతే!" అన్నాడు. ట్రేలో నేను మిగిల్చిన టిప్పును లెక్కబెట్టిన తర్వాత పైకి లేచి "యీ వూళ్లో యెన్నాళ్లుండాలి నువ్వు?" అని అడిగాడు.

"వారం రోజులు సెలవుపెట్టాను. ఈలోగా పనైపోతే వెళ్ళిపోతాను. కాకపోతే సెలవును పెంచాలి" అంటూ నేనూ అతడి వెనకే రెస్టారెంటు బయటికొచ్చాను. తర్వాత "చీకటిపడుతోంది. మీరు ఇంటికి వెళ్లిపొండి. నా తంటాలేవో నేను పడతాను" అన్నాను వీలయినంతగా కంగారును కప్పి పుచ్చుకుంటూ.

స్కూటర్ స్టాండ్ తీసి కూచుంటూ "ట్రెయినింగ్‌లో భగవాన్ నాకు చాలా సహాయంగా వుండేవాడు. నిన్నిప్పుడిలా అర్థాంతరంగా విడిచిపెడితే యేమయినా అనుకుంటాడు. యిక తప్పదు. కూచో, మా యింటికే వెళ్దాం!" అన్నాడతను.

"మీ రాణికి యిబ్బందేమో!" అని సాగదీశాను. అతనోసారి వెనుదిరిగి నాకేసి వురిమి చూశాడు. నేను బుద్ధిగా సూట్‌కేసుతో బాటూ పిలియనుపైన కూర్చున్నాను.

నగరపు వయ్యారాల కవ్వింతల్లో పడి నేను దారీతెన్నూ మరచిపోయిన తర్వాత స్కూటర్ వో యింటిముందు ఆగింది. చుట్టూ పెంచిన చీకటిపూల తోట మధ్య, మిణుగురు పురుగుల్లా రాత్రి దీపాల్ని వెలిగించుకున్న ఆ యిల్లు స్పష్టాస్పష్టంగా, కల్పననూ నిజాన్నీ కలిపి కట్టిన కట్టడంలా కనిపిస్తోంది.

కాలింగ్‌బెల్ నొక్కిన మూడు నిముషాల తర్వాత తలుపులు తెరుచుకున్నాయి. గుమ్మం దగ్గర పొడవూ పొట్టీగాని స్త్రీ కనిపించింది. యువతీగాదు. ముసలావిడాగాదు. ఆవిడ నావైపు మాత్రమేగాదు, రాంషాకేసయినా చూడకుండా వెనుదిరిగి వెళ్లిపోయింది. 'కొత్తవాళ్లంటే మారాణికి చిరాకు" అన్న రాంషా మాటల్ని మననం చేసుకుంటూ, తలుపులు తెరిచిన స్త్రీ అతడికి భార్యో, బంధువో, లేకపోతే పనిమనిషో అర్థంగాక మీమాంసలో పడిపోయాను.

లేత వూదారంగు గోడలతో హాలు సుషుప్తిలో పడి జోగుతున్నట్టుంది. మరో గత్యంతరం లేనట్టుగా వస్తువులన్నీ తమతమ స్థానాల్లో సర్దుకుంటున్నాయి.

రాంషా తన పిల్లి కళ్లతో నన్నాసాంతం పరకాయించాక "యిక్కడే వుండు... యిప్పుడే వస్తాను" అన్నాడు లోపలికెళ్తూ.

కాస్సేపు తటపటాయించాక సూట్‌కేసును టీపాయ్ పక్కన వుంచి, సోఫాలో కూర్చున్నాను. రెండు నిముషాలు అటూయిటూ వొరిగిన తర్వాత, వెనక్కు వాలి సేదదీరసాగాను.

గోడపైన క్రమబద్ధంగా కొట్టుకుంటున్న గడియారం నాపైన నిఘా వేస్తున్నట్టుంది. నల్లటి చేవకొయ్యతో చేసిన షోకేసులో పెద్దకన్నులా నల్లటి టీవీ మెరుస్తోంది. దాని వందిమాగదుల్లా టేపు రికార్డరూ, వీసీఆరూ పక్కనే కూర్చున్నాయి. వాటిపక్కన నిలువుగా పేర్చిన ఆడియో కేసెట్లు రాంషా సంగీత ప్రియుడేమోనన్న సందేహాన్ని రేకెత్తించే ఆశ్చర్యార్థకపు సంజ్ఞలా నిలబడి వున్నాయి. యెదురుగా మరో గోడపైన రెండు ఫోటోలు కనిపిస్తున్నాయి. కుడివైపున్న ఫోటోలో రాంషా, అతడి భుజాన్ని వొరుసుకుంటూ మరో స్త్రీ నిల్చుని వున్నారు. ఆవిడలో యిదివరకు తలుపులు తెరిచిన వ్యక్తి పోలికలను వెదుకుతూ కాస్సేపు గడిపాను. దాని పక్కనున్న ఫోటోలో యిద్దరు యువకులు ఫోటోకోసమన్నట్టుగా బలవంతంగా నవ్వుతున్నారు. వొకటి ముఖంలో రాంషా పోలికలు, మరొకడిలో ఆ స్త్రీ పోలికలూ కొట్టొచ్చినట్టుగా కనిపిస్తున్నాయి.

"రాణిని మా బెడ్‌రూంలో పెట్టి బీగంవేసి వస్తున్నాను. కొత్తవాళ్లని చూస్తే రాణికి పిచ్చెక్కుతుంది" అన్న రాంషా మాటలు వినిపించి వులిక్కిపడి వెనుదిరిగి చూశాను. పాదాల సవ్వడి లేకుండా, పిల్లిలా అతడెలా రాగలిగాడో అర్థంగావడంలేదు. నా చేతికో గ్లాసు మంచినీళ్లిస్తూ అతను యెదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

యెంతకూ తెగకుండా కొనసాగుతున్న నిశ్శబ్దాన్ని భరించలేక "మీరీ వూరొచ్చి యెన్నాళ్లయింది?" అని అడిగాను, యేదోవొకమాట మాట్లాడ్డం కోసం.

"యెప్పుడో యిరవై మూడేళ్ల క్రితం వచ్చాను. పదమూడు సంవత్సరాల క్రితం ట్రాన్స్ఫరుపైన నార్త్‌కెళ్లాను. మళ్లీ సెవన్ యియర్స్ క్రితం యిక్కడికి తిరిగొచ్చాను..." అన్నాడతను హాల్లోని వస్తువులన్నింటినీ పర్యవేక్షిస్తున్నట్టుగా చూస్తూ.

"మీ స్వంత వూరేది?" అని ప్రశ్నించాను.

"మా నాన్నది ఉత్తరప్రదేశ్. మా అమ్మది మధ్యప్రదేశ్. నేను పుట్టిందేమో చిదంబరం. యిక నా వూరేదేదంటారు?" అంటూ అతను నా ప్రశ్నను నాకేసే పరావర్తనం గావించాడు.

రాంషా అనే పేరు యే మతస్థుడిదైవుంటుందో తోచడంలేదు. రాంలాల్, భాషా, బెర్నార్డ్ షా... యిలా రకరకాల పదాల్ని వుచ్ఛరిస్తూ యేదో వొక మత చిహ్నం కనిపించకపోతుందా అని హాలంతా పరిశీలించసాగాను.





తర్వాత "మీ శ్రీమతిగారిదే వూరు?" అని మరో గాలాన్ని వదిలాను.

యీ ఆరాలన్నీ నీకెందుకన్నట్టుగా "పేపరు చూడు" అంటూ దినపత్రికను నాముందుకు తోశాడు రాంషా.

ఆమెకూ యితడికీ పెళ్ళెలా జరిగింది? అది పెద్దలు కుదిర్చిన పెళ్లా? లేకపోతే ప్రేమ వివాహమా? ఆవిడేదైనా వుద్యోగం చేస్తోందా? యిదివరకూ కనిపించిన వ్యక్తి యితడి భార్యేనా? రకరకాల ప్రశ్నలు వొక్కసారిగా ముట్టడి చేయడంతో నేను అయోమయంలో పడిపోసాగాను.

"కాఫీ తెస్తాను. యిక్కడే కూచో!" అన్నాడతను. చూపులతోనే నాకోసం పంజరం నిర్మిస్తున్నవాడిలా అయిదు నిముషాలు నాకేసి తదేకంగా చూశాక, పైకిలేచి, హాలు చివరున్న మలుపు తిరిగి మాయమైపోయాడు. హాలుకావైపు గోడకున్న తలుపుల వెనక యేముందో తెలియడంలేదు.

రాంషా లోపలికెళ్లిపోయిన తర్వాత పైకి లేచి నిల్చున్నాను. అతడి ఆజ్ఞను ధిక్కరిస్తున్నందుకేమో, నా గుండె వుద్వేగంతో వూగిపోసాగింది. హాలు మూలలో కనిపిస్తున్న పుస్తకాల బీరువా దగ్గరికి గెంతుతున్నట్టుగా చేరుకున్నాను.

తత్త్వశాస్త్రం, వృక్షశాస్త్రం, మానవశరీరశాస్త్రం, ఆర్కిటెక్చర్, టాక్సు రూల్సు, ఆబ్సర్డ్ డ్రామా, ముఖేష్ కీ జిందగీ, మణిమేఖల... వొకదానితో వొకటి పొంతనలేని పుస్తకాలు యిష్టంలేని పొరుగున యిబ్బందిపడుతున్నట్టుగా బిక్కమొగమేస్తున్నాయి. యింట్లో యిప్పుడు యిద్దరు వ్యక్తులు మాత్రమే కనిపిస్తున్నారు. ఆ ఫోటోలోని రాంషా కొడుకులెక్కడున్నారు? వేరే వూళ్లో వున్నారా? లేకపోతే ఈ ఊళ్ళోనే హాస్టల్లో వుంటున్నారా? తల్లిదండ్రుల్ని వదిలిపెట్టి వేరే యింట్లో యెందుకుండాలి? యింతకూ తలుపులు తెరిచిన స్త్రీ, ఫోటోలోని వ్యక్తీ వొకరేనా? వాళ్ళిద్దరూ అక్కాచెల్లెళ్లు కారుగదా! ఈవిడ బావగారిని ముగ్గులోకి దింపి, అక్కను ఇంట్లోంచీ తరమగొట్టేసిందేమో! అందుకే ఇతను కొత్తవాళ్ళను ఇంటికి తీసుకురావడానికి సందేహిస్తున్నాడుగాబోలు! యింట్లో రాణి వుందిగదా! దాన్ని గదిలో పెట్టి తాళం వేశానంటున్నాడు. రాణి అంటే తలుపులు తీసిన వ్యక్తి గాదా? రాణి అంటే మతిభ్రమించిన అతడి కూతురేమో!

రాంషా కాఫీ గ్లాసుల్ని తీసుకొచ్చిన తీరును గమనిస్తే, అతనే స్వయంగా వంటగదిలో కెళ్ళి, తయారుచేసి తెస్తున్నట్టుగా అనిపిస్తోంది. అయితే యిందాకా తలుపులు తెరిచిన వ్యక్తి వంటావిడగాదని అర్థమైంది. భార్య అయితే కాఫీ యెందుకు కలపలేదు? భర్త తరఫున వచ్చిన వ్యక్తులంటే నిర్లక్ష్యమేమో! అందుకే తలుపులు తెరిచాక ముఖం ముడుచుకుని వెళ్లిపోయి వుంటుంది. రాంషాపైన చెప్పలేనంత జాలేసింది. యీలోగా గదిలో పెట్టి తాళంవేసిన వ్యక్తి ఆవిడేగావచ్చునన్న అనుమానం వచ్చింది. రాంషా తీసుకొచ్చిన కాఫీ, నేను తాగలేకపోయిన టీ రుచినే గుర్తుకు తెచ్చి వేధించడం కోసమన్నట్టుగా చేదైపోసాగింది.

"యిక లేవచ్చు నువ్వు. గెస్టురూముకు తీసుకెళ్తాను పద!" అంటూ ఖాళీ కాఫీ కప్పుల ట్రే చేతబట్టుకుని ముందుకు కదిలాడు రాంషా. హాల్లోంచీ మలుపు తిరిగిన తర్వాత పెద్ద సొరంగంలాంటి వసారా కనిపించింది. దాని పక్కన వరసగా మూడు గదులున్నాయి. మూడో గది తెరిచి నన్ను లోపలికెళ్లమన్నట్టుగా పక్కకు తప్పుకున్నాడు అతను. నేను లోపలికి వెళ్లగానే, "లోపల గడియపెట్టుకో! రాణీని యింట్లోకి తీసుకెళ్తున్నాను. యెక్కువసేపు వొకే గదిలో వుండాల్సి వస్తే అది పేట్రేగిపోతుంది. తిరిగి నేను తలుపులు తట్టేవరకూ తెరవద్దు" అని హెచ్చరించాడు. నేను తలుపులు మూసుకున్న తర్వాత అతను వెళ్ళిపోతున్న అడుగుల చప్పుడు వినిపించింది.

ఆమెకూ యితడికీ పెళ్ళెలా జరిగింది? అది పెద్దలు కుదిర్చిన పెళ్లా? లేకపోతే ప్రేమ వివాహమా? ఆవిడేదైనా వుద్యోగం చేస్తోందా? యిదివరకూ కనిపించిన వ్యక్తి యితడి భార్యేనా? రకరకాల ప్రశ్నలు వొక్కసారిగా ముట్టడి చేయడంతో నేను అయోమయంలో పడిపోసాగాను.

నా సూట్‌కేసును గది మధ్యలోనే వుంచి, చుట్టూ పరికించాను. పసుపురంగు దుప్పటి పరచిన మంచంపైన ఈమధ్య యెవరూ పడుకున్న సూచనలు లేవు. చిక్కని నీలిరంగు పూసిన గోడలపైన రెండే ఫోటోలున్నాయి. ఆ రెండింటిలోనూ వొకే యువకుడు వేర్వేరు దుస్తుల్లో దర్శనమిస్తున్నాడు. యిదివరకు హాల్లో చూసిన ఫోటోలోని యువకులలో వొకడి రూపం ఈ ఫోటోల్లోని ఆకారానిదిగా అనిపిస్తోంది. గోడపైనున్న పొడవాటి చెక్కబీరువా తలుపులకు బీగం వేలాడుతోంది. బహుశా ఈ గది యింటిలోంచి వెళ్లిపోయిన వాళ్ల అబ్బాయిల్లో వొకడిదై వుండవచ్చు. లేకపోతే రాణి గదిగాదు గదా!

స్నానాలగది శుభ్రంగా వుంది. ట్రేలో అయిదారు రకాల సోపులున్నాయి. కొన్ని కొత్తవి. మరికొన్ని వాడినవి. యిందులో రాణి వాడే సోపేది? వొకో సోపునూ రాసుకుంటూ రాణి యెలాగుంటుందో వూహించుకోసాగాను.

స్నానం చేశాక, బట్టలు మార్చుకుని, గదిలో రాణి తాలూకు వివరాలకోసం గాలించసాగాను. యెనిమిది గంటలా అయిదు నిముషాలకు రాంషా తలుపు తట్టాడు. ముక్తసరిగా అతను "భోజనం రెడీ" అన్నాడు. బుద్ధిగా అతడి వెంట వసారాలోకొచ్చాను. దానికటు చివరలోని మరో సొరంగంలాంటి దారిగుండా డైనింగురూములోకి తీసుకెళ్లాడు రాంషా. డైనింగ్‌టేబులు ముందు యిదివరకు తలుపులు తెరిచిన స్త్రీ కనిపించింది.

మూసిన వంటగది తలుపుల్ని పరీక్షిస్తూ రాంషా పక్కన మరో కుర్చీలో కూర్చున్నాను. నాకావిడను పరిచయం చేస్తాడేమోనని యెదురు చూస్తూ నేనూ పళ్లెంలోకి అన్నం వడ్డించుకున్నాను.

"రాణి అన్నం తిన్నదా?" అని అడిగాడు రాంషా.

నేను వులిక్కిపడి తలపైకెత్తాను. ఆవిడ మాత్రం తలవంచుకుని తింటూనే "కొద్దిగా బ్రెడ్డూ పాలూ..." అంది చిత్రమైన మగగొంతుకతో.

"వుదయం నేను యెనిమిదికెళ్లాలి" అన్నాడతను.

"నేను యేడుకే వెళ్తాను" అందామె.

మరేమీ మాట్లాడకుండా, భోజనం ముగించుకొని ఆవిడ వెళ్లిపోయింది. యేదో అర్జెంటు పని వున్నట్టుగా రాంషా గబగబా తినసాగాడు. అంతవేగంగా తినలేకపోవడంతో నాకు పొలమారసాగింది . తినడం ముగించిన తర్వాత పళ్లెంతీసి సింకులో వేసి, చేతులు కడుక్కోసాగాడతను. నేనూ నా పళ్లెం తీసి సింకులో వేసి కడగడానికి పూనుకున్నాను.

"కడగొద్దు. అలా వుంచెయ్యి" అని అరిచాడు రాంషా.

అతిథి చేత యెంగిలిపళ్లెం కడిగించడం యిష్టంలేక అతనలా కసిరాడో, లేకపోతే వాళ్ల పళ్లాన్ని నేను సరిగ్గా కడగకపోవడంతో మండిపడుతున్నాడో నాకర్థంగాలేదు.

చూపులతోనే నన్ను గదిదాకా లాక్కొచ్చిన తర్వాత "యిక లోపలికెళ్ళి గడియపెట్టుకో! రాణి రాత్రుళ్లు యిల్లంతా తిరుగుతూ వుంటుంది. ఆమధ్య మా యింటికొచ్చిన మనిషొకడు చెప్పినా వినకుండా రాత్రుల్లు గది బయటికొచ్చాడు. రాణి రక్కేసింది. తర్వాత అతడు పదిరోజులు హాస్పటల్ బెడ్లో గడిపాడు. తెల్లారాక, నేను

తలుపులు తట్టేవరకూ, బయటికి రావద్దు!" అన్నాడతను పదేపదే అదే మంత్రాల్ని వల్లించే పురోహితుడిలా యాంత్రికంగా.

"మీ రాణికి ఆరోగ్యం సరిగా లేదా?" అన్నాను చీకట్లోకి రాయి విసురుతున్నట్టుగా.

"ఆమధ్య వరసగా రెండురోజులు అది అన్నం ముట్టలేదు. మాంసంపైకి మనసు మళ్లిందేమో, మాకు తెలియకుండా యేదో తిని అజీర్ణం తెచ్చుకుంది. రెండు పూటలు కడుపు యెండబెట్టాం. యిప్పుడంతా సర్దుకుంది" అంటూ యిక లోపలికెళ్లమన్నట్టుగా చూశాడు రాంషా.



"రాణి అంటే పెంపుడు పిల్లా? మీ భార్యగాదా?" అని అరిచాను.

అతను పెదవులు బిగబట్టుకుంటూ గుడ్లురిమి చూశాడు.

నేను గబుక్కున గదిలోకొచ్చి తలుపులు బిడాయించేశాను.

యింతకూ రాణి పెంపుడు పిల్లన్నమాట! పిల్లులు యెలుకల్ని తింటాయిగానీ మనుషుల్నెందుకు రక్కుతాయి? యింట్లోనే పెట్టి బంధించడంవల్ల అది పులిలా భయంకరంగా తయారయిందేమో! లేకపోతే వీళ్లిద్దరూ తప్ప మరో మనిషిని చూడకపోవడం వల్ల దానికి కొత్తవాళ్లంటే కోపమేమో! ఈ యింటికి మూడో మనిషి యెందుకు రావడంలేదు? వీళ్ల పిల్లలేమయ్యారు? బంధువులెక్కడున్నారు? మిత్రులనే వాళ్లు యింటికెందుకు రారు? ఆస్పత్రికెళ్లేలా మనుషుల్ని రక్కే పిల్లుల్నెవరైనా యింట్లో పెంచుకుంటారా? బహుశా పిల్లలు కొప్పడి యింట్లోంచి వెళ్లిపోయాక, ఆలోటు పూడ్చుకోడం కోసం వీళ్లు పిల్లిని పెంచుకుంటున్నారేమో! పిల్లలకు వీళ్లపైన కోపమెందుకొచ్చింది? బంధువులు వీళ్లను వెలేశారేమో! అనవసరంగా బంధువులు వెలేయరుగదా!

పిల్లిని గురించే ఆలోచిస్తూ నిద్రపోయానేమో, కలలో నాపైకో పెద్ద పిల్లి దూకి వొళ్లంతా రక్కేయసాగింది. పెద్దగా అరుస్తూ మేల్కొన్నాను. అదంతా కలని తెలియడానికి చాలాసేపు పట్టింది.

మంచినీళ్లు తాగి, చీకట్లోనే అటుయిటు కాస్సేపు పచార్లుచేసి, తర్వాత మళ్లీ పడుకున్నాను. నాలాంటి అతిథి యిలా యింటికి రావడం రాంషాకుగానీ, ఆవిడకుగానీ యిష్టంలేదని స్పష్టంగానే తెలిసిపోతోంది. తలుపులు తెరిచాక, రాంషా వెనక నేను కనబడగానే ఆవిడందుకే ముఖం ముడుచుకుని వెళ్లిపోయింది. మరో గత్యంతరంలేక తప్పనిసరై రాంషా నన్ను యింటికి తీసుకొచ్చాడు. అందుకే అంటీ ముట్టనట్టుగా వుంటున్నాడు. స్పష్టంగా అర్థంగాకపోవడంవల్లే ప్రపంచం కల్పనాత్మకంగా తయారైనట్టుంది. తన పాక్షిక దృష్టికి అందినదాన్నంతా యిష్టం వచ్చినట్లు ఆవిష్కరించి, తన భుజాలు తానే చరచుకునే సృజనాత్మక రచయితలా తయారయింది నా పరిస్థితి. చీకట్లో పడుకుని ఆలోచించే కొద్దీ, యీ మధనకంతా నా అనవసరపు కుతూహలమే కారణమనీ, దానికి నేను గొప్పగా తెలివితేటలని పేరు పెట్టుకుంటున్నాననీ అనిపించసాగింది. యిక యిలా కుదరదని లేచి దీపం వెలిగించేశాను. మెలకువో, నిద్రో తెలియని సుషుప్తిలో నేనుండగానే తెల్లారిపోయింది.

రాణి అన్నది పిల్లని తెలిసిపోయిన తర్వాత స్నానాల గదిలోని సోపులన్నీ వొకేరకంగా వెలవెలబోతూ కనిపించాయి. నేను దుస్తులు మార్చుకుని, సిద్ధమైన చాలాసేపటి తర్వాత తలుపులు తట్టిన శబ్దం వినిపించింది.

"ఫైలు తీసుకో! నిన్ను మీ ఆఫీసులో దించేసి నేను వెళ్తాను" అన్నాడు రాంషా వెనుదిరిగి యింటి బయటకు దారితీస్తూ.

మర్యాదకైనా టిఫిన్ తినమని అడుగుతాడేమోనని యెదురుచూశాను. చెప్పాపెట్టకుండా చేదుకాఫీ నా ముఖాన గొడతాడేమోనని కంగారు పడ్డాను. తలుపులకు బీగంవేసి స్కూటర్ దగ్గరికి చేరుకున్నాడు రాంషా. బహుశా అతడి భార్య టిఫిను చేసి వుండదు. అసలావిడ వంటే చేయదేమో! రెండో భార్య అయితే, మొదటి భార్య పిల్లల్ని తరమగొట్టి, మొగుడి నెత్తిపైకెక్కి చిందులేయకుండా వుంటుందా?

ఆలోచిస్తూనే స్కూటరు వెనక సీటుపైన కూర్చుని కళ్లుమూసుకున్నాను. పొద్దున్నే వుద్యోగానికెళ్లే భార్య వంటేలా చేస్తుంది పాపం! అలాంటి పరిస్థితిలో భార్యాభర్తలిద్దరికీ హోటలు తిండి తప్పదుగదా! యితనూ యిప్పుడు హడావుడిలో వున్నాడు. అందుకే టిఫిను తినకుండానే ఆఫీసుకెళ్తున్నాడు. యిబ్బంది కలిగేలా వీళ్ల నెత్తిపైన పడుతున్నదిగాక, యిలా వీళ్ల గురించి యేవేవో వూహించుకోవడం తప్పుగాదా? ఆ ఆలోచనరాగానే వులిక్కిపడి కళ్లు తెరిచేశాను. చీకటి తయారవగానే నా చూపుడు వేలు నాకేసి చూపెట్టడం నాకేమాత్రమూ రుచించడం లేదు.

రాణి అన్నది పిల్లని తెలిసిపోయిన తర్వాత స్నానాల గదిలోని సోపులన్నీ వొకేరకంగా వెలవెలబోతూ కనిపించాయి. నేను దుస్తులు మార్చుకుని, సిద్ధమైన చాలాసేపటి తర్వాత తలుపులు తట్టిన శబ్దం వినిపించింది.

యింతలో స్కూటరు నన్ను హెడ్డాఫీసులో దిగబెట్టింది. ముఖం ముడుచుకుని పనిలోకి జొరబడ్డాను. యెంతగా ప్రయత్నించి నా పిల్లి నా ఆలోచనల్లోంచి వెళ్లిపోవడంలేదు. వొకమాటకు బదులు మరోమాటను రాసి, వొక పనికి బదులు మరో పని చేసి అందరి దగ్గరా చివాట్లు తినసాగాను.

సాయంకాలం అనుకున్నదానికంటే ముందుగా హెడ్డాఫీసు కొచ్చేశాడు రాంషా. నేను స్కూటర్ వెనక కూర్చోగానే మధ్యాహ్నం నుంచి నా కోసం అతనెలా హోటల్ గదికోసం వెతికాడో చెప్పడం మొదలుపెట్టాడు. గదులు దొరకని యిలాంటి సమయంలో నన్నీవూరికి బట్వాడా చేసిన భగవాన్‌పైన మండిపడసాగాడు. అతని చీవాట్లు వింటూ వుండిపోవడంతో మార్గాయాసమే తెలియలేదు.

వీధి తలుపుల తాళం తీసి యింట్లోకి నడిచాడతను. హాల్లో సోఫాలో స్థబ్దంగా కూర్చుని వుందావిడ. అతనీసారి కాలింగ్‌బెల్ మోగించకుండా తాళంతీసి లోపలికి రావడం వెనకున్న రహస్యాన్ని బేధించడమెలాగో నాకు స్ఫురించడంలేదు.

"రాణి భలే అల్లరి చేసింది. భరించలేక రూంలోపెట్టి తాళమేశాను..." అందావిడ గోడతో మాట్లాడుతున్నట్టుగా.

"నువ్వు గదిలోకెళ్లి గడియపెట్టుకుంటే, నేను రాణిని హాల్లోకి తీసుకొస్తాను" అంటూ రాంషా కోపంగా హాలు మలుపుకేసి చేయి చాపాడు.

గదిలోకెళ్లి, తలుపులు మూసుకుని, మంచంపైకి వాలిపోయాను. ఆ గది నాకు జైలులా మారిపోయినట్టు అర్థమైంది. పోగొట్టుకున్న స్వాతంత్ర్యం విలువ తెలిసి రాసాగింది. సాయంత్రం యేమీ తినకపోవడంతో కడుపులో పేగులు అరవసాగాయి. లైటయినా వేసుకోకుండా అలాగే చీకట్లో పడుకున్నాను.

యింటి తాళం చెవులు ఉద్యోగాలు చేస్తున్న భార్యాభర్తలిద్దరి దగ్గరా వుండటంలో ఆశ్చర్యమేముంది? భార్య లోపలికొచ్చి తలుపులేసుకుంటుంది. ఆ తర్వాత వచ్చే భర్త బీగం తెరిచి లోపలికొస్తాడు. యింత మాత్రానికే చిత్రమైన ఊహలతో కథనల్లుకోవడమెందుకు? యీ యింటి సంగతి స్పష్టంగా అర్థంగాకపోవడం వల్లే నాలో సృజనాత్మకత రేకెత్తుతోంది. లోపాలన్నీ బయటి ప్రపంచంలోనే వున్నాయనీ, నా ఆలోచనల్లో లేవనీ యెందుకనుకోవాలి? తెలియని వూరికి యిలా వొంటరిగా వచ్చి, యిష్టంలేని అతిథిగా గడపడం కంటే జాలిపడాల్సిన విషయం మరేముంటుంది? అయినా మూన్నాళ్లుండి వెళ్లిపోయే నాకు ఈ విషయాలన్నీ తెలుసుకోవాలన్న ఆసక్తి యెందుకు?

చాలాసేపటి తర్వాత తలుపులపైన చప్పుడు వినిపించింది. తెరిచిన తలుపుల వెలుతురులోంచీ చీకటితో చేసిన బొమ్మలా కనిపిస్తున్నాడు రాంషా.

"గబగబా భోజనం ముగించాలి. నన్ను నైట్ డ్యూటీకి రమ్మని ఇప్పుడే ఫోనొచ్చింది" అన్నాడు ఆదుర్దాగా.

డైనింగ్ టేబులు దగ్గర ఆవిడ కూడా వుంది. యెవరికి వాళ్లే వడ్డించుకుని తినసాగాం. గరిటల చప్పుడూ, తింటున్న శబ్దమూ తప్ప మరేమీ వినబడడంలేదు. నేను గదిలో వున్నప్పుడు హాల్లోనూ, హాల్లోకొచ్చినప్పుడు గదిలోనూ వుండే పిల్లితో నా జీవనోత్సాహం యెలా ముడిబడిపోయిందో అర్థంగావడంలేదు.

తాను తిన్న పళ్లెంతీసి సింకులో వేస్తూ "నాకు డ్యూటీవుంది. వెళ్ళక తప్పదిప్పుడు" అంటూ ఆవిడలోనికెళ్లిపోయింది. యీసారి గూడా భోజనం త్వరగా తినడమన్న పోటీలో రాంషాకే విజయాన్నందించాక నేనూ హాల్లోకి

వచ్చాను.

"యిక గదిలోకెల్లి తలుపులేసుకో! రాత్రికి యింట్లో నువ్వొక్కడివే వుండాలి. రాణి రాత్రుళ్ళు యిల్లంతా పచార్లు చేస్తూ వుంటుంది. దానికంటబడితే ప్రమాదం. బయటినుంచీ లాక్ చేసుకెళ్తాం! వుదయం మేం తిరిగొచ్చి, తలుపులు తట్టాకే బయటికిరా! జాగ్రత్త!" అని చెప్పడం ముగించాక, యింకా ఆలస్యమెందుకన్నట్టుగా విసుగ్గా చూశాడు రాంషా.

నేను గదిలోకెళ్ళిన కొద్దిసేపటి తర్వాత రాంషా స్కూటరు కదిలిన శబ్దం వినిపించింది. గదిలో వొంటరిగా నేను! యిల్లంతా యధేచ్ఛగా తిరుగుతూ పిల్లి! దాని పనే బాగుంది. అయినా అదేమంత భయంకరమైన జంతువు! అది రక్కేస్తే అంత ప్రమాదమా? రక్కడానికి పైకొచ్చే పిల్లిని, అలాగే చేతుల్లోకెత్తుకుని, నేలపైకి విసిరికొట్టలేమా?

యింట్లోంచీ, యేమూలనుంచయినా, యెంత చిన్న శబ్దం వినిపించినా, అది పిల్లి జాడేనేమోనని, చెవులు రిక్కించి పిల్లిలా వినసాగాను. యిక్కడికొచ్చి యింత కాలం గడచినా, యింత వరకూ దాన్ని చూడలేకపోవడం చాలా అవమానకరంగా తోచసాగింది. 'అసలు యింట్లో పిల్లంటూ వుంటే నేను చూడలేకపోవడమేమిటి?' అని నన్ను నేను సరిపెట్టుకోజూశాను. నిజానికి యీ యింట్లో పిల్లన్నది లేదేమోనన్న అనుమానం చిగురెత్తసాగింది. నన్ను గదిలోంచి బయటికి రానివ్వకుండా చేయడంకోసం వీళ్ల పిల్లినొకదాన్ని సృష్టిస్తున్నారేమో!

నేను యిల్లంతా యెందుకు తిరగకూడదు? నానుంచీ వీళ్ల దాచాలనుకుంటున్న ఆంతరంగిక రహస్యాలేమిటి? వీళ్లిద్దరూ కలిసే బయటికెళ్లారా? లేకపోతే యెవరి దారిని వారు వేర్వేరుగా వెళ్లిపోయారా? రాత్రుల్లో ఆవిడగారు చేసే రాచకార్యాలేమిటి? యింట్లో వొంటరిగా వున్న నాకు పిల్లి భయం పెట్టడమెందుకు? రాత్రంతా మేలుకుని నేను యిల్లు కాపలా కాయాలన్న వుద్దేశంతో పిల్లి భయాన్ని నాలో రేకెత్తించారా వీళ్లు? రాత్రి కానుకానూ పిల్లి నాలో అనేకరకాల స్వాతిశయాలనూ, అవమానాలనూ రగిలించసాగింది. సాగుతున్న కాలాన్ని లెక్కబెట్టడం కోసమన్నట్టుగా నా గుండె గడియారంలా పెద్దగా కొట్టుకోవడం మొదలుపెట్టింది.


దేనికోసం వెతుకుతున్నానో ఆలోచించకుండా, మంచంకింద, టీపాయ్ వెనక గాలించాను. స్నానాలగది తలుపుల వెనక పాత హాకీ స్టిక్ కనిపించగానే నాలో పెద్దగా వుద్వేగం చెలరేగింది. దాన్ని చేతితో గట్టిగా పట్టుకుని, నెమ్మదిగా తలుపులు తెరుచుకుని బయటికొచ్చాను. పిల్లిలా సవ్వడి చేయకుండా, జాగ్రత్తగా అన్ని వైపులా గమనిస్తూ మలుపు తిరిగి హాల్లోకొచ్చాను.

రాత్రి దీపపు వెలుతురులో సర్దినవి సర్దినట్టుగా వున్న హాలు తన క్రమబద్ధతతో వెక్కిరిస్తున్నట్టుగా కనిపిస్తోంది. మెత్తగా పాదాల్ని మోపుతూ, హాలు కటు చివరిలోని గోడదగ్గరికెళ్లి, దాని కానుకుని నేలపైన కూర్చున్నాను. యిల్లంతా బలాదూర్లు తిరిగే పిల్లి హాల్లోకి రాకుండా యెలాపోతుంది? హాకీ స్టిక్ పైకెత్తి పట్టుకుని, కళ్ళయినా ఆర్పకుండా, అప్రమత్తంగా దానిరాకకోసం యెదురు చూడసాగాను.

వొంటరి దోమొకటి చెవిదగ్గర చేరి గీపెడుతున్నా నేను చలించడంలేదు. గోడపైన బల్లి కిచకిచలాడుతోంది. గోడ గడియారం నా గుండెల చప్పుడుతో పోటీపడసాగింది. హాల్లో నిశ్చలంగా వున్న క్రమబద్ధతలో నేనూ భాగమైపోవడం ద్వారా, దానిపైకి సవాలు విసరసాగాను. హాకీ స్టిక్‌ను పైకెత్తి పట్టుకున్న చేయి నొప్పెడుతోంది. నిద్రరాకతో కనురెప్పలు కిందికి జారినప్పుడల్లా వులిక్కిపడి, మళ్లీ సర్దుకుని కూచోసాగాను.

యింతకూ పిల్లి లేదేమో! యిది కేవలం నన్ను యేమార్చడం కోసం సృష్టించిన మాయేనేమో! వుంటే హాల్లో కెందుకు రాదు? గడియారంలో సెకండు ముల్లు సైతం గర్భిణీగా వున్న పిల్లిలా బరువుగా కదులుతోంది. బలవంతంగా కళ్లు తెరుచుకుని, నొప్పెడుతున్న చేతికి విశ్రాంతి నివ్వడం కోసం మరో చేతిలోకి హాకీ స్టిక్‌ను మార్చుకుంటూ కూర్చున్నాను.

వున్నట్టుండి యింటి లోపలి నుంచీ యేదో శబ్దం వినిపించింది. పెద్దగా



కళ్లు విప్పార్చుకుంటూ, హాకీ స్టిక్‌ను పైకెత్తి పట్టుకుని సన్నద్ధమైపోయాను. మరోసారి హాల్లోంచి కనిపిస్తున్న తలుపుల వెనక పెద్దగా సవ్వడి వినవచ్చింది.

యేక్షణాన్నయినా పిల్లి రావచ్చు. నా వుద్విగ్నతను సమయం వీలైనంత యెక్కువగా సాగదీయసాగింది. యెగసిపడుతున్న గుండెతో బాటూ చేతిలోని హాకీ స్టిక్ గూడా లయబద్ధంగా కంపిస్తోంది.

డబడబమని శబ్దం చేస్తూ తలుపులు తెరుచుకున్నాయి.

నేను హాకీ స్టిక్‌ను సిద్ధంగా పట్టుకున్నాను.

గదిలోంచీ రాబోతున్న మూరడెత్తు పిల్లి ఆకారం కోసం యెదురు చూడసాగాను. నన్ను మరింతగా వివశుడ్ని చేస్తూ అయిదున్నర అడుగుల మానవ ఆకారం గబుక్కున బయటికొచ్చింది.

గదిలోంచి బయటికొచ్చిన వ్యక్తి గోడపైని స్విచ్ నొక్కాడు. పెద్దదీపం పట్టపగల్లాంటి కాంతిని హాలునంతా కప్పేసింది. అతనో అడుగు పక్కకేసి, యింతలో గోడపక్కన నన్ను చూడగానే అలాగే నిలబడిపోయాడు. దీపం వెలుతురు అతడి ముఖంలోని నీడలనంతా మెల్లగా కరిగిస్తోంది. నేను అసంకల్పితంగానే హాలు గోడపైని ఫోటోకేసి తిరిగి చూశాను. ఆ యిద్దరు యువకుల్లోనూ యితనొకడని అనిపిస్తోంది. అయితే నిజంగా చూసినప్పుడు అతడిలో తల్లిదండ్రుల పోలికలు రెండూ పెనవేసుకున్నట్టు కనిపించడంతో విచలితుణ్ణయిపోసాగాను.

అతనెంతకూ మాట్లాడకపోవడంతో కంగారుపడుతూ– "నేను రాంషాగారి స్నేహితుడ్ని! రాత్రి వాళ్లిద్దరూ బయటికెళ్తూ నన్ను యింటిని చూసుకోమని చెప్పారు" అన్నాను.

అయితే యేమన్నట్టుగా తలపంకించాడతను.

"రాణి అల్లరి చేస్తోంటే దాని కథేమిటో చూద్దామని యిలా వచ్చి కూచున్నాను" అన్నాను మాట మాటకూ మధ్య యెడాన్ని పెద్దది జేస్తూ.

"రాణా! అదెవరు?" స్త్రీ కంఠంలా ధ్వనిస్తున్న చిత్రమైన గొంతుకతో అతడు మాటల్ని రువ్వాడు.

"పిల్లి! మీ అమ్మానాన్నా పెంచుకుంటున్నారుగదా!" అన్నాను తడబడుతూనే.

"రాత్రి ఫోన్ చేసినప్పుడు యింట్లో గెస్టున్నారని చెప్పారు. కొత్తగా పిల్లినెప్పుడు తెచ్చుకున్నారు?" అన్నాడతను తన చూపులతో నన్ను స్పర్శిస్తూ.

అతను తెరిచిన తలుపులగుండా గదిలోపలికి తొంగిచూశాను. పడకమంచమూ, దానిపక్కన హైహీలు చెప్పులూ కనిపించాయి. బహుశా వాళ్ళమ్మానాన్న రాత్రికి యింట్లో వుండరని యితగాడికి ముందే తెలిసి వుండవచ్చు. యింట్లో యెవరూ వుండరనుకుని స్నేహితురాల్ని వెంటబెట్టుకొచ్చినట్టున్నాడు. యిలా జరగడం యిదే మొదటిసారి గాకపోవచ్చు! నేను మరింత కుతూహలంగా గదిలోపలికి చూడసాగాను.

అతను హాల్లోంచి మలుపు తిరిగి లోనికెళ్ళి, అరనిముషంలోనే మంచినీళ్ల బాటిల్‌తో తిరిగొచ్చాడు. గోడపక్కన యింకా అలాగే కూర్చున్న నాకేసి అదోలా చూస్తూ గదిలోకెళ్ళిపోబోయాడు. యితగాడిలా హఠాత్తుగా గదిలోంచి వూడిపడడం, అంతే హఠాత్తుగా తిరిగి వెళ్ళిపోబోవడం నాలో నిరాశను మిగిల్చేలా వుంది.

"రాణిని చూడకుండానే వెళ్లిపోతారా?" అని అడిగాను. నా చేతిలోని హాకీ స్టిక్ నేలపైన టపీమని పడుతుండగా.

అతను నాకేసి తిరుగుతూ సీసాలోంచి రెండుగుక్కల నీళ్ళు తాగాడు. తర్వాత "వాళ్ల పెంచుకుంటున్న పిల్లిపైన నాకంత ఆసక్తి యెందుకు? అది వాళ్ల ఆంతరంగిక విషయమేమో!" అన్నాడు. ఆ తర్వాత మళ్లీ వెనక్కు తిరిగి, గదిలోకెళ్లి తలుపులు ధబీలున మూసేశాడు.

యింతకూ యీ కుర్రాడేం చేస్తున్నాడు?

చదువుకుంటున్నాడా? లేకపోతే వుద్యోగం చేస్తున్నాడా? రాత్రి యింటికొచ్చేముందు ఫోను చేశానంటున్నాడు. అంటే పొరుగూర్లో వుద్యోగం చేస్తూ రాత్రే యిక్కడికొచ్చాడా? యింటి తాళంచెవి యితడి దగ్గరకూడా వున్నట్టుంది. అంటే యితను గూడా యీ వూళ్లోనే యింకెక్కడో వుద్యోగం చేస్తూ యీ యింట్లోనే వున్నాడేమో! ఆ గదిలో కనిపించిన హైహీలు చెప్పులెవరివి? ఆ గదిలో అతడితోబాటు మరో స్త్రీ కూడా వుందా? అవి రాంషా భార్యవేమో! అది ఆవిడ బెడ్‌రూం గావచ్చు. పొరుగూరి నుంచి వచ్చిన కుర్రాడు తన తల్లి గదిలోకెళ్లి ఆవిడ పడకపైన పడుకోవడంలో ఆశ్చర్యమేముంది? యింతకూ యీకుర్రాడు తాను వాళ్ల కొడుకునని స్పష్టంగా చెప్పలేదు. అసలావిడ రాంషా భార్యేనా? లేకపోతే రెండో భార్యా? వాళ్లు పిల్లాడ్ని పెంచుకుంటున్నంత శ్రద్ధతో పెంచుకుంటున్న పిల్లిపైన యీ కుర్రాడికెందుకు ఆసక్తిలేదు? అదిసరే, యితను నాపేరైనా అడగలేదెందుకు? అతడి దృష్టిలో నేనూ అతడి తల్లిదండ్రుల ఆంతరంగిక విషయాల జాబితాలోని వాడినేనా? నాకూ పిల్లికీ తేడా లేదా? యిలాంటి కుతూహలకరమైన సందేహాలేవీ అతడికెందుకు కలగడంలేదు? యీ ప్రశ్నలన్నీ నన్నే యెందుకు ముట్టడిస్తున్నాయి?


నన్నీ పరిస్థితిలో చూశాక ఆ అబ్బాయి నా గురించి యేమనుకుని వుంటాడు? రేపు నా గురించి రాంషాతో యేం చెబుతాడు? హాకీస్టిక్‌తో వాళ్ల పిల్లిపైన దాడికి తయారయ్యానని తెలిస్తే రాంషా యేం చేస్తాడు? అసలు ఆ అబ్బాయి నన్నీ పరిస్థితిలో చూసినట్టు వాళ్లకు చెప్పడేమో! యిప్పటి వరకూ రాణి నా కంటపడనేలేదు. యీ యింట్లో పిల్లంటూ వొకటి వుందా లేదా?

పైకిలేచి నీరసంగా అడుగులేస్తూ, వుందో లేదో తెలియని పిల్లి జాడకోసం యింకా చావని ఆశతో చుట్టూ కలయజూస్తూ గదికి తిరిగొచ్చాను.

నా డైరీలోంచి వో పేజీ చింపి దానిపైన నాలుగు వాక్యాలు బరికాను. నాసూట్‌కేసుతోబాటు గదిలోంచి బయటికొచ్చాను. పిల్లొకటి వుందేమో, అమాంతం పైకి దూకి నా రక్తం రుచి చూసేస్తుందేమోనన్న భయంతో వణుకుతూ, పిల్లిలేదేమో, అనవసరంగా భయపడుతున్నానేమోనన్న కంగారుతో వూగిసలాడుతూ, చుట్టూ యేదైనా సవ్వడి వినవస్తుందేమోనని పిల్లిలా చెవులు రిక్కించి వింటూ హాలు దాకా వచ్చాను. నేను రాసిన వుత్తరాన్ని టీపాయ్‌పైన పేపరు వెయిట్ కింద వుంచేశాను. ముఖద్వారం దగ్గరికెళ్లిన తర్వాత చివరిసారిగా పిల్లికోసం హాలునంతా చూపులతో గాలించాను. పిల్లిని చూడాలన్న కోరిక మరింత బలంగా తయారై నన్ను నిలువునా ముంచెత్తుతుందేమోనని భయపడుతూనే తలుపుల్ని తెరిచి బయటికి గెంతాను. లోపల తలుపుల ఆటోమేటిక్ బీగం క్లిక్‌మంది. యింక లోపలికెళ్లాలన్నా వీలులేదన్న విషయం స్ఫురించింది.

నేను ఆ యింటి నుంచి దూరంగా వెళ్లేకొద్దీ, నేను చూడలేకపోయిన పిల్లితోబాటూ, రాంషాకు నేను రాసి పెట్టిన వుత్తరంలోని మాటలు గూడా పదేపదే నన్ను వెంటాడసాగాయి: "రాంషాగారూ! రాత్రి మీ పిల్లి నా ముఖాన్నంతా రక్కేసింది. నేను ఆస్పత్రిలో చేరడానికి వెళ్లిపోతున్నాను. మన్నించండి!"

•



# విషజంతువుల్లో రకాలు

విషం అంటే తెలియనివారుండరు కదా. విషం అంటే మరణాన్ని తెప్పించే ఒకానొక పదార్థం. గరళం అనీ అంటారు కాని దీనికి దానికి తేడా ఉన్నట్లు లేదు. ఇంగ్లీషులో దీనికి కొన్నిపదాలున్నాయి. POISON, VENOM, TOXIN అని అంటారు. పాము, తేలు, జెర్రి, సాలెపురుగు, తేనెటీగ కొన్ని అరుదైన జాతుల కప్పలు ఇంకా ఇతర జీవులు విషపూరితమైనవి. వీటి విషం శరీర రక్తంలోకి సరాసరి ప్రవేశిస్తే రకరకాల హానికరవు ప్రభావాలను చూపిస్తాయి. ఇలాటి విషాన్ని వెనోమ్ అంటారు. అంటే కొన్ని జంతువులు తమ శరీరాల నుంచి ఉత్పత్తిచేసే హానికర పదార్థాలు. ఇవి మన శరీరంలోకిగాయం, గాటు, కుట్టు ద్వారా ప్రవేశించి హానికి కారణమవుతాయి. అయితే కొన్ని గాయాలు చేయవు. కుట్టవు, కరవవు. కాని వాటిని మనం తాకినా విషప్రభావం ఘోరంగా ఉంటుంది. విషమండూకాలు, కొన్ని జెల్లి చేపలు ఇలాంటివి. మొత్తానికి ఇలాటి విషాన్ని వెనోమ్ అంటారు.

ఇక టాక్సిన్ అంటే తెలుసుకొందాం. ఆహార పదార్థాలు కుళ్ళి విషపూరితమైన సందర్భాలలో ఉత్పత్తి అయ్యే పదార్థాలు ఇవి. అంటే ఆ పదార్థాలలోకి సూక్ష్మజీవులు చేరి విషాలను ఉత్పత్తి చేస్తాయి. ఆ విషాన్ని టాక్సిన్ అంటారు. తినగానే ఇవి విరోచనాలు, బేధులు, మరణాన్ని సయితం తీసుకొనివస్తాయి. మనవాళ్లు ఇలాంటి సందర్భాలలో ఆహారంలో బల్లిపడిందని ఏదో సాకుచెప్తారు. బల్లిపడితే ఆహారం విషపూరితమవుతుందని ఏశాస్త్రప్రయోగాలు నిరూపించలేదు. మొత్తానికి కలుషిత ఆహారం విషంగా మారడం టాక్సిన్‌ల ప్రభావం వల్లనే. ఇలా విషాలు రెండు రకాలు. ఏదైనా పాయిజనే- విషమే. కాని టాక్సిన్ విధానం వేరు. వెనోమ్ విధానం వేరు. ఇంకోలా చెప్పాలంటే వెనోమ్ విషమేకాని, విషాలన్నీ వెనోమ్‌లు కావు. టాక్సిన్ విషమేకాని, విషాలన్నీ టాక్సిన్‌లు కాదు. విషసర్పాలలో లాలాజల గ్రంధులే విషగ్రంధులుగా మారతాయి. విషం ఒకవిధంగా మన ఉమ్మితో సమానం. సమాంతరంగా వాటి దంతాలు కూడా రూపాంతరం చెంది కోరలుగా మారతాయి. అంటే ఇంజక్షన్ సూదులుగా, ఒకే జత మాత్రం ఉంటాయి. ఇవి విరిగినా మరో వెనక జత ఈ రూపానికి మారిపోతాయి. అదేమాదిరిగా గిలామాన్సటర్ అనే ఒక విష తొండలో కూడా ఇలాటి మార్పు జరిగింది. ఇది ఉత్తరమెరికా వాసి. ఏకైక విషబల్లి. కొన్ని విష చుంచులు కూడా ఉన్నాయి. వీటిలోనూ ఇవే మార్పులు వస్తాయి.

ఇక సాలెపురుగులు, జెర్రులు ఉన్నాయి. వీటిలో కూడా గ్రంధులు ఇలా విష లక్షణానికి మారినా వాటి దవడలు విషాన్ని గాయం ద్వారా ప్రవేశపెడతాయి. సాలెపురుగులు చాలా వరకు సామాన్య విషాన్ని కలిగి ఉంటాయి. మనుషులకి హానికరం కాదు. కాని కొన్ని జాతులు మాత్రం ఘోరమైనవి. బ్లాక్ విడోస్పైడర్ కాటు మనుషులకి మరణాన్ని తెప్పించగలుగుతుంది. ఇక తేళ్ళ విషయం అందరికి తెలిసిందేకదా. "తలనుండు విషము ఫణికిని, వెలయంగా తోకనుండు వృశ్చికమునకున్" అన్నారు కదా. తోకచివర కొండిలో (చివర పూసఅనాలి) విషం ఉంటుంది. చాలా బాధపెట్టి వదిలినా, దీని విషం కొన్ని జాతుల్లో మరణాన్ని తీసుకొని వస్తుంది. ఇక తేనెటీగల్లో కూడా కొండే కారణం. గాయం కావడం అందులో ఏకంగా కొండే ప్రవేశం చేసేస్తుంది. ఇక్కడ రెండు విషయాలు గమనించాలి. ఒకటి, తేనెటీగల్లో ఆడవాటికే అంటే కూలి ఈగలకే ఈ సదుపాయం ఉంటుంది. రెండోది దానికొండికి కొక్కాలు ఉండడంవల్ల కుట్టిన తరువాత కొండి వెనక్కిరాదు. లోపలఇరుక్కొనిపోతుంది. లాగినప్పుడు ఈగ శరీరంచీరు కొనిపోయి మరణిస్తుంది. కొండి శరీరంలోనే ఉండిపోయి చాలా బాధ కలిగిస్తుంది. తేనెటీగల కోపం జగద్విదితం. ఒకసారి మనిషి మీద దాడిచేస్తే మరణానికి కూడా కారణం అవుతాయి ఈ తేనెటీగలు. పాము విషంలో రెండు రకాలుంటాయి. హిమోలిటిక్, నూరోలిటిక్ విధానాలుంటాయి. మొదటిది రక్తనాళాలను ఛేదిస్తుంది. రక్తస్రావం జరిగి మరణం సంభవిస్తుంది. రెండవది మెదడు నాడుల మీద పనిచేసి మగత, కోమా మరణానికి కారణం అవుతుంది.

– జమ్మి కోనేటిరావు